క్లుప్తంగా

దుకాణాలకు చేరిన యూరియా



బుచ్చినాయుడుకండ్రిగలోని దుకాణం వద్ద యూరియా లోడ్‌తో లారీలు

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ఆర్‌బీకేలు, దుకాణాలలో యూరియా అందుబాటులోకి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం 'సాక్షి' దినపత్రికలో 'యూరియా కోసం బారులు తీరిన రైతులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన వ్యవసాయశాఖ అధికారులు యూరియా సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లటంతో ఆర్‌బీకేలు, దుకాణాలకు యూరియా అందుబాటులోకి తీసుకురావడంతో రైతులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నియోజకవర్గ స్థాయి వాలీబాల్, కబడ్డీ టోర్నీ



టోర్నీ కోసం కోర్టులను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం ఉదయం 9 గంటలకు సత్యవేడు నియోజకవర్గ స్థాయి వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు జనార్ధన్ తెలిపారు. వాలీబాల్, కబడ్డీ టోర్నీలో పాల్గొనేవారు అండర్ -14, 17 బాలికలు, బాలురకు మాత్రమేనని, పాఠశాలలో చదువుతూ ఉండాలని, ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని, ప్రతి టీం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

దర్గామిట్టలో కార్డన్‌సెర్చ్



దర్గామిట్టలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం ఒకటో పట్టణ సీఐ గోపి ఆధ్వర్యంలో పట్టణంలోని దర్గామిట్టలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డులు సరిగాలేని 17 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ గోపి మాట్లాడుతూ.. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

కాంగ్రెస్‌పార్టీ సమన్వయకర్తగా దామోదర్‌రెడ్డి



తలపా దామోదర్‌రెడ్డి

శ్రీకాళహస్తి : జాతీయ కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్తగా పట్టణానికి చెందిన తలపా దామోదర్ రెడ్డి నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి.. దామోదర్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు అవకాశం కల్పించిన వైఎస్ షర్మిలారెడ్డికి, తిరుపతి డీసీసీ అధ్యక్షుడు బాల గురవంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలో పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు.

ప్రశ్నించే గొంతుక ప్రజానాట్య మండలి



ప్రజానాట్యమండలి కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న నేతలు

శ్రీకాళహస్తి : పట్టణ శివారులోని రాజీవ్ నగర్‌లో ఆదివారం ప్రజానాట్య మండలి ప్రాంతీయ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాల లోటుపాట్లను పాటల రూపంలో ఎండగట్టడంలో ప్రజానాట్య మండలి ముందుంటుందన్నారు. జిల్లాల విభజన అనంతరం శ్రీకాళహస్తి డివిజన్ కేంద్ర బిందువుగా మారిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజానాట్యమండలి కార్యాలయాన్ని శ్రీకాళహస్తి కేంద్రంగా ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు వేణు, సెల్వరాజు, హరికృష్ణ, కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి సురేష్ పాల్గొన్నారు.

సత్యవేడు నేతల ఆశలు.. అడియాశలు

- నామినేటెడ్ పదవుల్లో మొండిచేయి
- రెండు విడతల్లోనూ దక్కని ప్రాధాన్యం
- నిరాశలో కూటమి నేతలు
- నియోజకవర్గ పదవులపైనే ఇక ఆశలు

పాలక మండలికి నోచుకోని పళ్లికొండేశ్వరాలయం



వరదయ్యపాళెం : కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో సత్యవేడు కూటమి నేతలకు నిరాశే ఎదురైంది. మొదటి, రెండో విడతల్లో ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో నియోజకవర్గానికి మొండిచేయి మిగిలింది. నియోజకవర్గంలోని 7 మండలాల నుంచి పలువురు కీలక నేతలు ఏదో ఒక పదవి తమను వరిస్తుందని ఆశపడ్డారు. అయితే నియోజకవర్గం నుంచి ఎవరికీ చోటు కల్పించకపోవడంతో ఆశావహులు ఖంగుతిన్నారు. దీంతో మూడు పార్టీలకు చెందిన నేతలు కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. జెండా మోసిన అసలైన పార్టీ శ్రేణులకు న్యాయం జరగడం లేదంటూ లోలోపల ఆవేశంతో ఊగిపోతున్నారు. కనీసం ఒక్కటంటే ఒక పదవీ నియోజకవర్గానికి దక్కకపోవడం దారుణమని ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.



సత్యవేడు టవర్ క్లాక్

సకాలంలో భర్తీ అయ్యేనా..!

నియోజకవర్గంలోని పలు నామినేటెడ్ పోస్టులు అయినా సకాలంలో భర్తీ అవుతాయా? లేక కాలయాపన చేస్తారా? అన్న అనుమానం పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ప్రధానంగా సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వరాలయ పాలక మండలి, కైలాసనాథ కోన పాలక మండలి, నాగలాపురం, బీఎన్‌కండ్రిగ మార్కెట్ కమిటీలకు సంబంధించి నామినేటెడ్ పదవులను భర్తీ చేయాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై అయిదు నెలలు గడుస్తున్నా ఆ దిశగా కసరత్తు జరగడం లేదు. ఈ పదవులకు సంబంధించి నియోజకవర్గంలోని పలువురు కీలక నేతలు ఆశావాహులుగా ఉంటూ తమ రాజకీయ గాడ్ ఫాదర్ల ఆశీస్సుల కోసం వెంపర్లాడుతున్నారు.

గత ప్రభుత్వంలో నియోజకవర్గానికి పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులకు సంబంధించి సత్యవేడు నియోజకవర్గానికి పెద్దపీట వేసింది. ఆ దిశగా కేవీబీపురం మండలంలో స్టేట్ హిస్టరీ బోర్డు డైరెక్టర్, ఉమెన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్, పిచ్చాటూరు మండలంలో ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్, వరదయ్యపాళెం మండలంలో దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ పదవులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించింది. రిజర్వుడ్ నియోజకవర్గమైన సత్యవేడుకు 5 రాష్ట్ర స్థాయి పదవులను కేటాయించి నామినేటెడ్ పదవులకు పెద్దపీట వేసింది. దీంతో కూటమి నేతలు తమ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల పందేరం ఉంటుందని ఎంతగానో ఊహించుకున్నారు. చివరకు రెండు విడతల్లోనూ సత్యవేడుకు ప్రాధాన్యం దక్కకపోవడంతో కూటమి నేతలు నిరాశలో కూరుకుపోయారు. కనీసం స్థానిక నామినేటెడ్ పదవులైనా దక్కుతాయా లేదా అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు.



పాలక వర్గానికినోచుకోని బీఎన్‌కండ్రిగ, నాగలాపురం మార్కెట్ కమిటీ

ఎమ్మెల్యేపై సస్పెన్షనే కారణమా?

మహిళపై లైంగిక వేధింపుల కారణంతో స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై తెలుగుదేశం పార్టీ సస్పెన్షన్ విధించింది. ఈ ఘటన జరిగి రెండు నెలలు పూర్తి కావస్తోంది. దీంతో అటు అధికార పార్టీ శ్రేణులు, ప్రభుత్వం యంత్రాంగం నడుమ అనిశ్చిత నెలకొంది. నియోజకవర్గంలో స్తబ్ధత వాతావరణం కనబడుతోంది. నామినేటెడ్ పదవుల కోసం ఆశావహులుగా ఉన్న పలువురు కీలక నేతల ఆశలు ఎమ్మెల్యే సస్పెన్షన్ వేటుతో ఆవిరయ్యాయి. నియోజకవర్గంలో ఆశావహులుగా ఉన్న వివరాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లలేని పరిస్థితుల్లో సస్పెన్షన్‌కు గురైన సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్న కారణంతో నియోజకవర్గానికి నామినేటెడ్ పదవుల్లో అవకాశం లభించలేదని పలువురు కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేపై సస్పెన్షన్ తొలగిపోతుందంటూ పలువురు ఎమ్మెల్యే అనుకూల వర్గీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదన్నది మెజారిటీ నియోజకవర్గ టీడీపీ నేతల అభిప్రాయం. ఇదే పరిస్థితులు కొనసాగితే స్థానిక నామినేటెడ్ పదవులు సకాలంలో భర్తీకాక పోవచ్చని ఆ పార్టీ నేతలే కొంత మంది చర్చించుకోవడం గమనార్హం.

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారి



ఆలయం వద్ద ఐఏఎస్ అధికారి కన్నబాబు

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ కార్యదర్శి కన్నబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారానికి ఎంపిక



బాలసుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారానికి బాలసుబ్రహ్మణ్యం ఎంపిక అయ్యారు. తొట్టంబేడు మండలంలోని దిగువసాంబయ్యపాళెం పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాలసుబ్రహ్మణ్యం ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారాన్ని సోమవారం జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకుని విజయవాడలో విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అందుకోనున్నారు.

రౌడీ షీటర్లపై పోలీసు నిఘా



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

రేణిగుంట : రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకపోతే చర్యలు తప్పవని రేణిగుంట అర్బన్ సీఐ శరత్‌చంద్ర హెచ్చరించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఆదివారం రౌడీ షీటర్లకు రేణిగుంట పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వీరిపై ఎల్లప్పుడు పోలీసు నిఘా ఉంటుందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వీరి కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామన్నారు. ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన 'యువ తరంగ్'

తిరుపతి సిటీ : ఎస్వీయూలో మూడు రోజులుగా యువతరంగ్ పేరుతో నిర్వహిస్తున్న యూత్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై పలు సాంస్కృతిక విభాగాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఫెస్టివల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు చెన్నైలో జరిగే సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రొఫెసర్లు దామోదర్‌రెడ్డి, బీవీ మురళీధర్, డాక్టర్ వివేక్, డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ వద్ద ధర్నా



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

తిరుపతి కల్చరల్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 26వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పేరుతో కార్మికులకు అనేక హామీలు ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి ఐదు నెలలు కావస్తున్నా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏ మాత్రం చొరవ చూపడం లేదని మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద ధర్నాకు పెద్దసంఖ్యలో కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాధాకృష్ణ, నేతలు ఎన్‌డీ రవి, కేవై రాజా, వైఎస్ మణి, నాగేంద్ర , బాబు, హేమావతి, అన్నాదొరై, వాణి, బుజ్జి, కార్తీక్, శ్రీనివాసులు, సుశీల, చంద్రకళ, పురుషోత్తం పాల్గొన్నారు.

కళత్తూరు దళితులకు అండగా నిలుస్తాం



సమావేశంలో ప్రసంగిస్తున్న సత్యవేడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని కేవీబీపురం మండలం కళత్తూరు దళితవాడకు చెందిన స్థానిక దళితుల అనుభవంలో ఉన్న భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఇది చాలా సున్నితమైన అంశంగా పరిగణించి అటవీశాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కళత్తూరు వెళ్లి దళితుల అనుభవంలో ఉన్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్లకు పైగా కళత్తూరు దళితుల అనుభవంలో ఉన్న భూముల వ్యవహారంలో ప్రస్తుతం అటవీశాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రస్తుతం ఆ భూముల్లో పంటలను సాగు చేసి ఉన్న నేపథ్యంలో పంట చేతికి వచ్చే వరకు అటవీ శాఖ అధికారులు సంయమనం పాటించాలని కోరారు. సాగులో ఉన్న పంటలకు సంబంధించి వంద రోజుల వరకు ఆర్డీవో గడువు ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ సమస్య పార్టీలకు అతీతమని, అక్కడ సాగు చేస్తున్న 150 మంది దళిత రైతులు అన్ని పార్టీలకు సంబంధించిన వారని, ఈ విషయంలో రాజకీయాలు పక్కన పెట్టి మానవతా దృక్పథంతో ఆలోచన చేసి సమస్య పరిష్కరింపజేయాలని కోరారు. సమావేశంలో తిరుపతి జిల్లా మహిళా కన్వీనర్ బొర్రా మాధవిరెడ్డి, వైస్ ఎంపీపీ సరస్వతి రమేష్, మాజీ జెడ్పీటీసీ డేవిడ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ వర్మ, ఎంపీటీసీ అయ్యప్ప, పార్టీ నాయకులు మణి, గోవిందస్వామి, బాలసుబ్రమణ్యం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



సుబ్రహ్మణ్యం యాదవ్‌ను పరామర్శిస్తున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రమాదానికి గురైన బీసీ నేత సుబ్రహ్మణ్యం యాదవ్‌ను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త , జేసీఎస్ కన్వీనర్ రాకేష్‌తో కలిసి పరామర్శించారు. మండలంలోని కుక్కంబాకం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల బీసీ నేత సుబ్రహ్మణ్యం యాదవ్ గత నెల ద్విచక్రవాహనంలో వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, సత్యవేడు నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ వేలూరు రాకేష్, నాయకులతో కలసి సుబ్రహ్మణ్యం యాదవ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో ఆరోగ్యం గురించి ఆరా తీసి, ధైర్యం చెప్పారు. అనంతరం పచ్చాలమ్మ ఆలయంలో జరిగిన వైఎస్సార్‌సీపీ మండల యువజన నాయకుడు కిరణ్‌యాదవ్ బంధువుల వివాహ వేడుకకు హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, గురునాథం, నాయకులు గురవయ్య, అజయ్‌కుమార్‌రెడ్డి, దేవదాసురెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయాలి



ఏపీటీఎఫ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సంఘం నేతలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని ఫైర్‌స్టేషన్ సమీపంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పట్టణానికి చెందిన ఎస్వీ డెంటల్ అధినేత లక్ష్మీనారాయణ హాజరయ్యారు. అనంతరం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే 30 శాతం ఇంటీరియల్ రిలీఫ్ ప్రకటించాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, వరప్రసాద్, అశోక్‌కుమార్, వెంకటాద్రి, వెంకటముని పాల్గొన్నారు.

కంచరపాళెంలో లోఓల్టేజీ సమస్య



కంచరపాళెంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వరదయ్యపాళెం : మండలంలోని కంచరపాళెంలో నిత్యం విద్యుత్ లోఓల్టేజీ సమస్య కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ సాయంత్రం లోఓల్టేజీతో పలు ఇళ్లలో లైట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కాలిపోతున్నాయని, దీనివల్ల తీవ్ర నష్టం జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించమని పలుసార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కంచరపాళెంలోని హరిజనవాడ వద్ద నిత్యం లోఓల్టేజీతో జనం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి లోఓల్టేజీ సమస్యను నివారించాలని కోరుతున్నారు.

శంఖారావం సభ సన్నాహక సమావేశం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

శ్రీకాళహస్తి : విజయవాడలో జనవరి 5వ తేదీన జరిగే హైందవ శంఖారావం సభకు సంబంధించి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కేవీబీపురం మండల కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈసందర్భంగా తిరుపతి విభాగం ప్రముఖ్ మల్లికార్జున మాట్లాడుతూ.. 77 సంవత్సరాలుగా హిందూ ఆలయాలను ప్రభుత్వ నిర్వహణలో ఉంచుకుని రాజకీయ పదవులకు పునరావాస కేంద్రాలుగా మారుస్తూ ఆధ్యాత్మిక విలువలకు తిలోదకాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఇతర మతాల మాదిరిగా హిందూ దేవాలయాలను స్వయం ప్రతిపత్తి కలిగిన ఉత్తమ ధార్మిక వ్యవస్థలకు అప్పగిస్తూ చట్ట సవరణ చేయాలని విశ్వహిందూ పరిషత్ ఒక జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంజూరు బాలసుబ్రహ్మణ్యం, శశాంక్ పాల్గొన్నారు.

బడి రుణం తీర్చుకోలేనిది

నారాయణవనం : విద్యా బుద్ధులు, క్రమశిక్షణను నేర్పిన బడిని, గురువుల రుణాన్ని తీర్చుకోలేమని మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవాన్ని ఆదివారం జరుపుకున్నారు. పాఠశాలలో 1974లో ఏర్పడిన పూర్వ విద్యార్థుల సంఘం పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తోంది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కేశవయ్య, రాజేంద్రపిళ్లై, వెంకటయ్య నాయుడులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, తెలంగాణ జైళ్ల శాఖ ఐజీ మురళితో పాటు పలువురు ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.



తెలంగాణ జైళ్ల శాఖ ఐజీ మురళిని సన్మానిస్తున్న తోటి పూర్వ విద్యార్థులు

శాస్త్రోక్తంగా చండీయాగానికి శ్రీకారం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో కామాక్షి అమ్మవారి చండీయాగానికి ఆదివారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో విశేష పూజ, హోమ మహోత్సవాలు నిర్వహిస్తున్నా రు. అందులో భాగంగా తొమ్మిది రోజుల పా టు చండీయాగం జరిపించనున్నారు. ఈమేర కు యాగశాలలో ఉదయం పూజ, నిత్య హో మం, చండీహోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి సమర్పించారు. సాయంత్రం హోమం, చండీ పారాయణం, సహస్రనామార్చన, విశేష దీపారాధన చేపట్టారు. గృహస్తులు ఇద్దరు రూ.500 చెల్లించి ఒక రోజు హోమంలో పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీయవద్దు

- శ్రీకాళహస్తి ఆలయ ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మగుడి వీధిలోని ఏడుగంగమ్మల ఆలయంలో భక్తులు అమ్మవారి అలంకరణ చూడాలనే ఉద్దేశంతో మధ్యాహ్నం 3 గంటలకు అభిషేకం చేశామని ఈఓ బాపిరెడ్డి తెలిపారు. అయితే భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా, అభిషేకం జరగలేదంటూ కొందరు సోషల్ మీడియాలో పెడుతున్నారని, ఇది సరికాదని ఖండించారు. ఈ విషయమై సింగరాజు ప్రకాశం శాస్త్రి మాట్లాడుతూ అమ్మవారి అలంకరణ భక్తులకు చూపించాలని, అభిషేకం ఆపడం ఆగమశాస్త్ర విరుద్ధమని అన్నారు. ఏ దేవతామూర్తికైనా కుంభాభిషేకం చేసిన తరువాత 45 రోజుల పాటు సూర్యోదయం నుంచి ఉదయం 10గంటల లోపు అభిషేకం నిర్వహించాలన్నారు. అయితే ఏడు గంగమ్మల ఆలయంలో మూడు గంటలకు అభిషేకం చేశామని అధికారులు చెప్పడం సరైంది కాదని, ఇది శాస్త్రవిరుద్ధమన్నారు. అభిషేకం ఎప్పుడు చేయాలనే దానిపై ప్రత్యేక నియమాలు ఉన్నాయని, అది ఉల్లంఘించారని, మూడు గంటలకు ఎవరూ అభిషేకం చేయరన్నారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం



కార్తీక దీపాన్ని ఎగురవేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజూ ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు.

15 దాకా తపాలా శాఖ శిబిరాలు



బాలాజీ

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి సబ్ డివిజన్‌లోని సచివాలయ పరిధిలో ఐపీపీబీ ఖాతాలు తెరిచేందుకు ఎన్‌పీసీఐ యాక్టివేషన్ కోసం ఈనెల 15వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు శ్రీకాళహస్తి సబ్ డివిజన్ తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు డీబీటీ లబ్ధిదారులు తపాలా ఖాతాలకు తప్పనిసరిగా ఎన్‌పీసీఐ లింకు కలిగి ఉండాలన్నారు. శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో శ్రీకాళహస్తి రూరల్, అర్బన్, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం , సత్యవేడు, కేవీబీపురం మండలాల పరిధిలో సుమారు 40,140 మంది తమ ఖాతాలను ఎన్‌సీపీఐ మ్యాపింగ్, ఆధార్ అనుసంధానం కాకపోవడంతో వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందే అవకాశం లేదన్నారు. ఎన్‌సీపీఐ యాక్టివేషన్‌కు సంబంధించి తపాలా శాఖలో ఖాతా ఉంటే వెంటనే లింక్ చేసుకోవాలని సూచించారు. తపాలాశాఖలో ఖాతాలు లేనివారు తమ ఆధార్‌కార్డు తీసుకుని ఆయా గ్రామాల పరిధిలో తపాలా కార్యాలయాలకు వెళ్లి ఖాతాలు తెరిస్తే మూడు రోజుల్లో ఎన్‌సీపీఐ యాక్టివేషన్ అవుతుందని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.